క్లుప్తంగా

సేవా భావాన్ని అలవర్చుకోవాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కొడంగల్ రూరల్: విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలని, ప్రజల్లో గూడుకట్టుకున్న మూఢ నమ్మకాలను నిర్మూలించేందుకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు చైతన్యం తీసుకురావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చిట్లపల్లి గ్రామంలో ఏడు రోజుల జాతీయ సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు వలంటీర్లు కృషిచేయాలన్నారు. గ్రామాల్లో వలంటీర్లు శ్రమదానం నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వలంటీర్లు లక్ష్యం ఏర్పాటుచేసుకొని ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు కృషిచేయాలని తెలిపారు. అంకితభావం, పట్టుదల, క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు వెంకట్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సోమ్లానాయక్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



కంకల్ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

పూడూరు: భవిష్యత్ తరాలకు వెలుగునిచ్చేది విద్య మాత్రమేనని, విద్యతోనే ప్రపంచాన్ని గెలవచ్చని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కంకల్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వరరావు, శ్రీను, సతీష్‌నాయుడు, ఏపీసీ సభ్యురాలు ప్రమీల, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



కడా అధికారికి వినతి పత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్

దుద్యాల్: మండల పరిధిలోని ఆలేడ్ గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కొడంగల్ మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి కడా అధికారి వెంకట్ రెడ్డిని కోరారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. నూతనంగా గ్రామ పంచాయతీగా ఏర్పడిన ఆలేడ్ పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గ్రామంలో పాఠశాల భవనం, గ్రామ పంచాయతీ భవనం, డ్రైనేజీ, సీసీ రోడ్లు, హైమాస్ట్ లైట్లు, త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు చేయాలని కోరారు. దీనికి కడా అధికారి సానుకూలంగా స్పందిచారన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



నూతన వైద్యాధికారి కిరణ్‌ను సన్మానిస్తున్న మండల నాయకులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిచడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్లమండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నూతన వైద్యాధికారిగా కిరణ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు ఆస్పత్రికెళ్లి ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ..కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో పేదలు ఎక్కువగా ఉన్నారన్నారు. ప్రభుత్వం వైద్యశాఖపరంగా అందించే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోగు వెంకటయ్య, పెంటమీది వెంకటయ్య, గోపాల్ నాయక్, క్రిష్ణారెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, చర్ల నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

వీడబ్ల్యూఎస్‌సీ నిధులు వాపస్

- మరుగుదొడ్లు పూర్తి స్థాయిలో నిర్మించకపోవడంతో చర్యలు
- వెనక్కి మళ్లించుకుంటున్న ప్రభుత్వం
- మండలం నుంచి రూ.1.23కోట్లు

దౌల్తాబాద్: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్ మిషన్‌లో(ఎస్‌బీఎం) భాగంగా 2017 సంవత్సరంలో ఇంటింటికి మరుగుదొడ్లను మంజూరు చేసింది. ప్రతీ ఇంట్లో తప్పనిసరిగా వ్యక్తిగత మరుగుదొడ్డి ఉండేలా చర్యలు చేపట్టింది. దీంతో అన్ని గ్రామాల్లో దాదాపు ప్రజలంతా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. అయితే నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో మంజూరు చేయకపోవడంతో ప్రభుత్వాలు పంచాయతీ ఖాతాలకు బదిలీ చేసిన నిధులు కొన్ని సంవత్సరాలుగా ఖాళీగా ఉన్నాయి. దీంతో వీడబ్ల్యూఎస్‌సీ (విలేజ్, వాటర్, శానిటేషన్, కమిటీ) కింద గతంలో పంచాయతీలకు బదిలీ చేసిన నిధులను ప్రభుత్వ ఖాతాల్లోకి వెనక్కి మళ్లించుకుంటుంది.



దౌల్తాబాద్‌లో నిర్మించిన మరుగుదొడ్డి

పంచాయతీ కార్యదర్శులు బిజీ..

ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.12వేలు మంజూరు చేయగా పనులు చేపట్టిన తర్వాత రూ.6వేలు, నిర్మాణ పనులు పూర్తయ్యాక మరో రూ.6వేలు పంచాయతీ కార్యదర్శుల ద్వారా అందజేసేది. అయితే అనేక కారణాలతో లబ్ధిదారులకు బిల్లులు అందించలేదు. నిర్మాణాలు పూర్తిచేయకపోవడం, తలుపులు బిగించకపోవడం, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం చేపట్టకపోవడం వంటి పనులు పెండింగ్‌లో పెట్టారనే కారణంతో బిల్లులు చెల్లించలేదు. దీంతో మిగిలిపోయిన నిధులను వెనక్కి పంపించాలని సర్క్యూలర్ విడుదల చేయడంతో పంచాయతీ కార్యదర్శులంతా నిధుల మళ్లింపు ప్రక్రియలో బిజీగా ఉన్నారు. మండలం మొత్తంగా రూ.1.23కోట్లు నిధులు పంపిణీ చేయకుండానే ఖాతాల్లోనే సంవత్సరాల తరబడి నిల్వ ఉండడంతో వాటిని తిరిగి ప్రభుత్వానికి పంపిస్తున్నారు.

> **ప్రభుత్వ ఖాతాల్లోకి మళ్లింపు**
>
> గ్రామ పంచాయతీల వీడబ్ల్యూఎస్‌సీ ఖాతాల్లోని నిధులను వెనక్కి పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దాంతో గ్రామ పంచాయతీల వారీగా వీడబ్ల్యూఎస్‌సీ ఖాతాల్లోని మొత్తాన్ని ప్రభుత్వానికి బదిలీ చేస్తున్నాం. ఇప్పటికే చాలా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బదిలీ చేశారు. మిగిలినవి త్వరలో బదిలీ చేస్తాం.
>
> – శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



వార్షికోత్సవంలో విద్యార్థులతో అధ్యాపకబృందం

గోట్లపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గాయత్రి

తాండూరు రూరల్: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గోట్లపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గాయత్రి పేర్కొన్నారు. శుక్రవారం గోట్లపల్లి మోడల్ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా స్కూల్లో బోధన నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తున్నారన్నారు. శ్రద్ధగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని, రానున్నకాలంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జినుగుర్తి, బంట్వారం మోడల్ స్కూల్ ప్రిన్సిపల్స్ శ్రీదేవి, బ్యూలాతో పాటు అధ్యాపకబృందం, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.



వీడ్కోలు సమావేశంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థులు కష్టపడి చదవాలి

పరిగి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని ప్రధానోపాధ్యాయుడు ఉస్మాన్‌అలీ పేర్కొన్నారు. మండల పరిధిలోని మిట్టకోడూర్ ప్రాథమిక పాఠశాలలో 5వతరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉస్మాన్ అలీ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ప్రభుత్వ పాఠశాలలు ఎంతో దోహదపడుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులు ఎంతో అనుభవం, పరిజ్ఞానం ఉన్న వారే ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, నర్సింహులు, రాజు, కవిత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత, నిబంధనలపై అవగాహన

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత, నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని కుల్కచర్ల ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలకు జరిమాన విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని, హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనాలను పట్టుకున్న పోలీసులు

ఏకరూప దుస్తులతో స్వయం ఉపాధి

కుట్టడానికి మహిళా సంఘాలకు అందజేత

బొంరాస్‌పేట: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందించే ఏకరూప దుస్తుల కుట్టు పనులకు సంబంధించి స్థానిక మహిళా సంఘాలకు అందజేశారు. దీంతో వారికి స్వయం ఉపాధి కల్పించినట్లవుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో కుట్టడానికి మహిళా సంఘాలకు వస్త్రాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పాఠశాలల్లో పేద, ధనిక భేదాలు లేకుండా ఒకేరకమైన దుస్తులు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ఏకరూప దుస్తువుల వల్ల విద్యార్థుల్లో స్నేహభావం పెరుగుతుందన్నారు.

సోలార్ ప్రాజెక్టు సైతం..

ఈ ప్రాజెక్టును స్థానికంగా ఏర్పాటు చేసేందుకు సీఎం కృషి చేస్తున్నారని, అందుకు మహిళలు సహకరించి ఉపాధి పొందాలన్నారు. ఇకముందు అమలులోకి రానున్న అన్ని సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాల్లో సీఎం మహిళలకు ప్రత్యేక స్థానం కల్పిస్తున్నారన్నారు. మే 15వరకు ఏకరూప దుస్తులు తయారు చేసి ఇవ్వాలని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

స్థానిక పాఠశాలలో నెలకొన్న మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఉపాధ్యాయినీలు, బాలికలు, విద్యార్థులంతా నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నట్లు నాయకులకు వివరించారు. ప్రహరీ, అదనపు తరగతుల నిర్మాణం, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. త్వరలో కడా అధికారి దృష్టికితీసుకెళ్లి పరిష్కరిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు వెంకట్రాములుగౌడ్, జయకృష్ణ, మల్లేశం, రాంచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, ఐకేపీ సిబ్బంది సాయన్న, రాంచంద్రయ్య, గ్రామ సంఘం అధ్యక్షురాలు బసమ్మ, అకౌంటెంట్ లక్ష్మి, నాయకులు బాల్‌రాజ్, మురళీగౌడ్, కృష్ణయ్య, ప్రభాకర్‌గౌడ్, నర్సింలు, లక్ష్మప్ప, రాజశేఖర్‌రెడ్డి, నర్సింలుచారి, వీరేశం, ఉపాధ్యాయులు మహేశ్, అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు శివనీల, సంతోశ తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాలకు ఏకరూప దుస్తుల వస్త్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగంచేసుకోవాలి

కుల్కచర్ల: విద్యార్థుల ఏకరూప దుస్తులు కుట్టడాన్ని మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ హబీబ్ అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు ఏకరూప బట్టలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వచ్చే విద్యాసంవత్సరానికి ఏకరూప దుస్తులు కుట్టించి ఇచ్చేందుకు మహిళ సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శోభ, మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: మహిళా సంఘాల సభ్యులకు ఏకరూప బట్టలను అందిస్తున్న అధికారులు

పథకాల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యం



పరిగి: గడిసింగాపూర్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు



యాలాల: సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మర్పల్లి: లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు పట్నం అశోక్

యాలాల: సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యమని బీ బ్లాక్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం చెన్నారం గ్రామంలో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామన్నారు. మల్లయ్య, బసిరెడ్డి, దశరథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, నర్సింహులు, మాదరప్ప, రాములమ్మ, బాజారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పంపిణీ చారిత్రాత్మకం

రేషన్ దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేస్తున్న సన్నబియ్యం చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గిరిజాపూర్‌లో మహిళలకు బియ్యం పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం చేపట్టిన ఈ పథకం దేశానికే ఆదర్శమన్నారు. మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, హన్మంత్‌రెడ్డి, లక్ష్మప్ప పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి సన్నబియ్యం..

అనంతగిరి: అర్హులైన ప్రతీ ఒక్కరికి సన్న బియ్యం పంపిణీ చేస్తుందని పీరంపల్లి మాజీ సర్పంచ్ గురువారెడ్డి అన్నారు. శుక్రవారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకనే అర్హులైన ప్రతీ ఒక్కరికి కొత్త రేషన్ కార్డులు అందజేస్తుందన్నారు. మల్లేశం, నర్సింలు, భిక్షపతి, రాములు, శ్రీనివాస్ రెడ్డి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పేదల ప్రభుత్వం

పరిగి: కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని జిల్లా నాయకుడు వెంకట్‌రాములు అన్నారు. గడిసింగాపూర్, నస్కల్ గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీని కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మొగులయ్య, వెంకట్‌రెడ్డి, మాణిక్యం, పెంటారెడ్డి, లక్ష్మయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్ రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందిస్తున్న సన్న బియ్యం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. శుక్రవారం అప్పాయిపల్లి గ్రామంలో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు సన్న బియ్యం ఉపయోకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆర్ జగదీశ్వర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: పేదలకు నాణ్యమైన బియ్యం అందిచాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని జిల్లా కార్యవర్గ సభ్యుడు పట్నం అశోక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లికార్జునగిరి గ్రామంలో ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియ్యం పంపిణీని డీలర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యస్థితిగతులు భాగుండాలనే లక్ష్యంతో సీఎం రేవంతరెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ కృష్ణ ప్రకాశ్, యూత్ ప్రెసిడెంట్ పవన్, గ్రామ మహిళా సంఘం ప్రెసిడెంట్ ఈశ్వరమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

నవాబుపేటలో..

నవాబుపేట: ప్రతి పేదోడికి సన్నబియం పంపిణీ చేస్తామని అర్కతల మాజీ సర్పంచ్ వడ్డె రాములు పేర్కొన్నారు. అర్కతల గ్రామంలో సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ అంబమ్మా, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్, గ్రామస్తులు రాములు, మానయ్య, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపడమే ధ్యేయం

దౌల్తాబాద్: పేదల కడుపు నింపడమే ప్రభుత్వ ధ్యేయమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. మండలంలోని చల్లాపూర్, దేవర్ ఫసల్‌వాద్ గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు గాయత్రి, నాయకులు విజయ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, వీరన్న, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

దేశం మెచ్చే పథకం

కుల్కచర్ల: సన్నబియ్యం పంపిణీ దేశం మెచ్చే పథకమని డీసీసీ కార్యవర్గసభ్యుడు పెంటమీది వెంకటయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామంలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, కుమ్మరి వెంకటయ్య, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీలో కేంద్రం పెద్దన్నపాత్ర

రేషన్ బియ్యం పంపిణీలో కేంద్రం పెద్దన్నపాత్ర పోషిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు పేర్కొన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని రేషన్‌షాప్‌లో నిర్వహించిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర టెలీకాం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఘనపురం వెంకటయ్య, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి, బీజేపీ కుల్కచర్ల మండల అధ్యక్షుడు వెంకటయ్యముదిరాజ్, ప్రధాన కార్యదర్శి హన్మంతు, శివసంతోష్, రాజశేఖర్, పాండు, ఆంజనేయులు, లాలు, హరికృష్ణ, దస్తయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: పేద కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. మహంతీపూర్, ఎన్కేపల్లి, రేగడిమైలారంలో సన్నబియ్యం పంపిణీ చేశారు. నర్సింలుగౌడ్, వెంకట్రాములుగౌడ్, జయకృష్ణ, మల్లేశం, రాంచంద్రారెడ్డి, ఆయా గ్రామాల నాయకులు మహిపాల్, మొగులయ్య, చంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి పెద్ద పీట

దుద్యాల్: పేదల అభ్యునతికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద పీట వేశారని కొడంగల్ ఏఎంసీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. కుదరుమల్ల గ్రామంలో సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ శివ కుమార్, మాజీ సర్పంచ్ రఘుపతి, రమేశ్, నర్సిములు, లాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

పూడూరు: పేదల కోసం ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేపట్టిందని మాజీ సర్పంచ్ శ్యాంకుమార్ అన్నారు. అంగడిచిట్టంపల్లి, పూడూరు, మేడిపల్లికలాన్, మేడికొండ, కడుమూరు, మిట్టకంకల్ తదితర గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ చేశారు. బందయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దోమ: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ సీనియర్ నేత మొగులయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామంలో మండల నాయకులతో కలిసి సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి



రాకంచర్ల ఆలయ ప్రాంగణంలో యజ్ఞం నిర్వహిస్తున్న సోమన్‌గుర్త రఘురాంరెడ్డి

పూడూరు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ఆధ్యాత్మిక వేత్త భాస్కరయోగి పేర్కొన్నారు. రాకంచర్ల యోగానంద లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయ ప్రాంగణంలో 5 రోజులుగా కీర్తనల పారాయణం చేయడం మనందరి అదృష్టమన్నారు. శుక్రవారం ముగింపు కార్యక్రమం సందర్భంగా వచ్చిన ఆధ్యాత్మిక వక్తలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సోమన్‌గుర్త రఘురాంరెడ్డి ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించారు. దీనికి మండల పరిధిలోని భక్తులే కాకుండా పరిగి, చేవెళ్ల తదితర గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాకంచర్ల పీఠాధిపతి వెంకటదాను, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గోధుమకుంట మరమ్మతులు ప్రారంభం

నందిగామ: కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని గోధుమ కుంట చెరువు మరమ్మతులకు సెట్రీస్ సంస్థ స్వచ్ఛందంగా ముందుకొచ్చి శుక్రవారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ తెలంగాణ కార్యనిర్వహణాధికారి అమర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం సెట్రీస్ సంస్థ దేశవ్యాప్తంగా స్వచ్ఛందంగా పనిచేస్తోందన్నారు. చెరువులు, కుంటలలో నీటి సామర్థ్యాన్ని పెంచడం కోసం పూడికతీత, కట్ట సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చెరువులో మరమ్మతులు చేపట్టేందుకు స్వచ్ఛదంగా ముందుకు వచ్చిన ఆ సంస్థను పలువురు అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోస్గీ శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యులు దేవేందర్‌యాదవ్, యాదయ్య, గోపాల్‌గౌడ్, మత్స్యకార సంఘం నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.